## అధ్యాయము 13

# అబ్రాహాము మరియు లోతు విడిపోవుట

అబ్రాహాము ఐగుప్తుకు వెళ్లేటప్పటికే అతను ఆస్తిపాస్తులున్న ధనవంతుడు (12:5). అబ్రాహాము ఐగుప్తులో కపటమైన నడవడి చూపినప్పటికీ దేవుడు ఫరోద్వారా అతనికి అదనంగా బహుమానాలు వచ్చేలా చేసి అతణ్ణి ఆశీర్వదించాడు (12:16; 24:35) ఏది ఏమైనప్పటికీ అబ్రాహాము శారాలు ఐగుప్తును విడిచిపెట్టి వెళ్లిపోవాలి కాబట్టి వారి ప్రయాణాలు మళ్లీ మొదలయ్యాయి.

ఎటువంటి సంఘటనల్లేకుండానే చివరికి వారు కనాను చేరుకున్నారు. ఐగుప్తు సరిహద్దువరకు ఎవరైనా ఒక ప్రభుత్వాధికారి వారి వెంట వెళ్ళి వారిని సరిహద్దు దాటించి ఉండవచ్చేమో, వాగ్దానదేశం నుండి వారిని బయటకు వెళ్ళేలా చేసిన కరవు గురించి మనకిక ఏ వివరాలు లేవు.

ఐగుప్తును విడిచిపెట్టిన తర్వాత అబ్రాహాము శారాల మధ్య సంబంధమెలా ఉందో తెలుసుకోవడానికి మనకెటువంటి వివరాలు తోడ్పడం లేదు. అబ్రాహాముకు ఫరోకు మధ్య నడిచిన వ్యవహారం వలన (అంటే, అబ్రాహాము స్వార్థం వలన) అబ్రాహాము శారాల మధ్య మాటలు యధావిధిగా ఉన్నాయా?

### అబ్రాహాము కనానుకు తిరిగి రావడం, మరియు లోతుతో అతని వివాదం (13:1–7)

**[1]అబ్రాము తనకు కలిగిన సమస్తమును తన భార్యను తనతో కూడనున్న లోతును వెంటబెట్టుకొని ఐగుప్తు నుండి నెగెబునకు వెళ్ళెను. [2]అబ్రాము వెండి బంగారము పశువులు కలిగి బహు ధనవంతుడై యుండెను. [3]అతడు ప్రయాణము చేయుచు దక్షిణమునుండి బేతేలు వరకు, అనగా బేతేలునకును హాయికిని మధ్య తన గుడారము మొదట ఉండిన స్థలము వరకు వెళ్లి [4]తాను మొదట బలిపీఠమును కట్టిన చోట చేరెను. అక్కడ అబ్రాము యెహోవా నామమున ప్రార్థన చేసెను.**

**[5]అబ్రాముతో కూడ వెళ్లిన లోతుకును గొఱ్ఱెలు గొడ్లు గుడారములు ఉండెను గనుక [6]వారు కలిసి నివసించుటకు ఆ ప్రదేశము చాలకపోయెను. ఎందుకనగా వారి ఆస్తి వారు కలిసి నివసించలేనంత విస్తారమై యుండెను. [7]అప్పుడు అబ్రాము పశువుల కాపరులకును లోతు పశువుల కాపరులకును కలహము పుట్టెను. ఆ కాలమందు కనానీయులు పెరిజ్జీయులు ఆ దేశములో కాపురముండిరి.**

**వచనము 1**. గ్రంథకర్త ఎటువంటి వివరాలు ఇవ్వకుండానే అబ్రాహాము **ఐగుప్తునుండి నెగెబుకు** ప్రయాణం చేయడం గురించి వ్రాశాడు (12:10 వివరణలు చూడండి). అబ్రాహాముతో బాటు అతని భార్య, అతని పరివారం ఉన్నారు. ఇక్కడ లోతుగురించి విడిగా చెప్పడం గమనార్హం. అబ్రాహాము ఐగుప్తులో ఉన్నప్పుడు అతనితో బాటు లోతు ఉండడం గురించి ఎటువంటి ప్రస్తావన లేనప్పటికీ, **లోతు** ఐగుప్తునుండి నెగెబుకు ప్రయాణమై వెళ్లాడని లేఖనాలు చాలా స్పష్టంగా చెబుతున్నాయి. ఈ ఇద్దరి మధ్య ఎడబాటుకు సమయం సమీపంలోనే ఉందని మాత్రం తెలుస్తున్నది.

**వచనము 2**. అబ్రాహాము ఐగుప్తుకు వెళ్లేటప్పటికే ఆస్తిపాస్తులున్న ధనవంతుడు (12:5). అబ్రాహాము ఐగుప్తులో కపటమైన నడవడి చూపినప్పటికీ, దేవుడు ఫరోద్వారా అతనికి అదనంగా బహుమానాలు వచ్చేలా చేసి అతణ్ణి ఆశీర్వదించాడు (12:16, 20). ఇది జరిగిన తర్వాత, అబ్రాహాము **మిక్కిలి ధనవంతుడయ్యాడు**. అతని సంపద కేవలం **పశువుల మందల్లో మాత్రమే కాదు, వెండి బంగారాల్లోకూడా** (24:35 చూడండి).

**వచనములు 3, 4**. పితరుడు తాను వచ్చిన దారిలోనే తిరుగు ప్రయాణం చేశాడు; **నెగెబు** నుండి ఉత్తరదిశగా ప్రయాణం చేసి **బేతేలుకు హాయికి మధ్య** ఉన్న ప్రదేశం చేరుకున్నాడు. ఇదివరలో ఇక్కడే అబ్రాహాము తన **గుడారంవేసుకొని, బలిపీఠంనిర్మించాడు**. అబ్రాహాము గతంలో తానున్న చోటుకు తిరిగి రావడం, ఐగుప్తులో జరిగిన భంగపాటు (చేదు అనుభవం) తర్వాత అతను మరల దేవునితో పూర్వానుభవంలోకి రావాలని కోరుకొని ఉండడాన్ని సూచిస్తుండవచ్చు. అబ్రాహాము **యెహోవా నామంలో ప్రార్థన చేసి, దేవుణ్ణి ఆరాధించాడు** (12:8 వివరణలు చూడండి). ఈ ఆరాధనలో అబ్రాహాము ఐగుప్తులో తన దోషపూరితమైన చర్యల్ని బట్టి పశ్చాత్తాపంతో దేవుణ్ణి క్షమాపణ వేడుకొనడం గురించి గ్రంథకర్త ప్రస్తావించకపోయినప్పటికీ, ఇటువంటిది జరిగి ఉండవచ్చనే భావన సమర్థనీయమే.

అబ్రాహాము మరల తిరిగి రావడానికి, కొండలతో నిండిన మధ్య ప్రాంతంలో అనుకూలమైన రుతువు (వాతావరణం) ఉండటం కూడా ఒక కారణం కావచ్చు. చలిగా తేమగా ఉండే మాసాల్లో (అక్టోబర్ నుండి మార్చ్ వరకు), పశువుల మందల్ని మైదానాల్లో మేతకు వదులుతారు. వాతావరణం వేడిగాను పొడిగాను

ఉండే మాసాల్లో (ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు) నీటిబుగ్గలు వాగులు ఉండే ఎత్తైన ప్రదేశాలకు మందల్ని తోలుకొని వెళ్లారు.[1]

**వచనము 5**. సమృద్ధమైన భౌతిక దీవెనల్ని అనుభవించినది అబ్రాహాము ఒక్కడే కాదు; అతనితో బాటు ప్రయాణమై వెళ్లిన **లోతు** కూడా **గొఱ్ఱెల మందలు పశువు మందలతో గొప్ప** దీవెనలు పొందాడు. ఇంకా, గుడారాల గురించి ప్రస్తావన అతను తన దాసదాసీజనంతో బాటుగా వెళ్లాడని కచ్చితమైన సమాచారాన్నిస్తున్నది (అబ్రాహాము ప్రయాణం చేసిన విధంగా; 12:16 చూడండి). పశువుల కాపరుల్లో చాలా మందికి బహుశా కుటుంబాలున్నాయేమో (14:16 చూడండి). కాబట్టి గ్రంథకర్త ఈ ఇద్దరికి ఉన్న గొఱ్ఱెలు పశువుల మందల గురించి వేర్వేరుగా ప్రస్తావించడాన్ని బట్టి, ఇక వారిద్దరూ కలిసి ప్రయాణం చేయడం సాధ్యమయ్యే పని కాదని స్పష్టంగా తెలుస్తున్నది.

**వచనము 6**. ఇద్దరికి చెందిన మనుషులకు, **విస్తారమైన మందలకు చాలా పెద్ద మొత్తంలో** నీరు మరియు మేతభూములు అవసరమవుతాయి కాబట్టి వారు ఇక కలిసి నివసించడానికి ఆ ప్రదేశం సరిపోదు. సులభమైన మాటల్లో చెప్పాలంటే, అబ్రాహాముకు లోతుకు వారుకలిసి ఉండలేనంత **విస్తారంగాఆస్తిపాస్తులున్నాయి**. తర్వాత కాలంలో, యాకోబు ఏశావులకు కూడా ఇటువంటి పరిస్థితులే ఎదురయ్యాయి (36:6, 7).

**వచనము 7**. గ్రంథకర్త హఠాత్తుగా ఇక్కడొక విషయాన్ని పొందు పర్చాడు; ఆ కాలమందు **కనానీయులు పెరిజ్జీయులు ఆ దేశములో కాపురముండిరి**. అబ్రాహాము మరియు లోతు యొక్క **పశువుల కాపరుల** మధ్య వివాదాలతో బాటు, అక్కడ బసచేయడానికి వచ్చిన అబ్రాహాము లోతులకు ఆ ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పరుచుకున్న స్థానికులతో వివాదాలు అనివార్యమయ్యాయి. కనానులో అప్పటికే నివాసం ఏర్పరుచుకున్నవారు తమ ప్రాంతంలోకి క్రొత్తవారు మనుషులే కాక, గొఱ్ఱెలు పశువుల మందలతో రావడంతో అప్రమత్తమయ్యారు. అబ్రాహాము సేవకులకు లోతు సేవకులకు మధ్య, వీరికి స్థానికులైన కనానీయులు పెరిజ్జీయులకు మధ్య వివాదాలతో కూడిన ఉద్రిక్త పరిస్థితులు నిస్సందేహంగా ఎక్కువవుతాయి.[2] ఇంత వరకు ఏం జరిగి ఉన్నప్పటికీ, ఇప్పుడు పచ్చిక కంటే పశువుల మందలెక్కువయ్యాయి. పశువులకు మేత, నీటివసతి మొదలైనవాటి కొరకు మేతభూములు నీటిబుగ్గల విషయాల్లో గిరాకీ పెరిగింది; స్థానికులు అప్పటికే వీటిమీద హక్కు తమవే అన్నారు.

**కలహం** బహుశా **పశువులకు** కావలసిన పచ్చికకొరకు మేతభూముల విషయంలోను నీటి వసతి విషయంలోను "కాపరుల" మధ్య జరిగి ఉండవచ్చు. తదుపరి కాలంలో ఇస్సాకు కాపరులకు, అబీమెలెకు కాపరులకు మధ్య కూడా ఇటువంటి కలహాలే చోటుచేసుకున్నాయి (26:12–33). పన్నెండవ అధ్యాయంలో, భార్యాభర్తల మధ్య ఉద్వేగపూరితమైన పరిస్థితులు తలెత్తాయి. అయితే ఇప్పుడు

అబ్రాహాము కాపరుల మధ్య లోతు కాపరుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడం వారి మధ్య ఉన్న బంధుత్వానికి ఆటంకమైంది.

## అబ్రాహాము యొక్క ఉదారమైన ప్రతిపాదన మరియు లోతు నిర్ణయం (13:8–13)

**[8]కాబట్టి అబ్రాము–మనము బంధువులము గనుక నాకు నీకును, నా పశువుల కాపరులకు నీ పశువుల కాపరులకును కలహముండకూడదు. [9]ఈ దేశమంతయు నీ యెదుటనున్నది గదా, దయచేసి నన్ను విడిచి వేరుగా నుండుము. నీవు ఎడమతట్టునకు వెళ్లినయెడల నేను కుడితట్టుకును, నీవు కుడితట్టునకు వెళ్లినయెడల నేను యెడమతట్టునకును వెళ్లుదునని లోతుతో చెప్పగా [10]లోతు తన కన్నులెత్తి యొర్దాను ప్రాంతమంతటిని చూచెను. యెహోవా సొదొమ గొమొఱ్ఱా అను పట్టణములను నాశనము చేయకమునుపు సోయరుకు వచ్చువరకు అదంతయు యెహోవా తోటవలెను ఐగుప్తు దేశమువలెను నీళ్లు పారు దేశమై యుండెను. [11]కాబట్టి లోతు తనకు యొర్దాను ప్రాంత మంతటిని ఏర్పరచుకొని తూర్పుగా ప్రయాణం చేసెను. అట్లు వారు ఒకరికొకరు వేరై పోయిరి. [12]అబ్రాము కనానులో నివసించెను. లోతు ఆ మైదానమందున్న పట్టణముల ప్రదేశములలో కాపురముండి సొదొమ దగ్గర తన గుడారము వేసికొనెను. [13]సొదొమ మనుష్యులు దుష్టులును, యెహోవా దృష్టికి బహు పాపులునై యుండిరి.**

**వచనము 8.** అబ్రాహాము ఈ పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించాలని నిర్ణయించుకున్నాడు. అబ్రాహాము లోతుతో సామరస్యంగా ఉండడం ఎంత ముఖ్యమో గుర్తించాడు. అసలే వారు పరిచయంలేని దేశంలో శత్రువులైన మనుషుల మధ్య నివసిస్తున్నారు. ఈ వచనం యొక్క హెబ్రీ మూలం అసాధారణంగా కనబడుతుంది: **మనము బంధువులము** అనే పదాలకు హెబ్రీ భాషలో "మనము మనుషులము, బంధువులము" అని ఉంది; ఇది సమానాధికరణం. అంటే, హెబ్రీ ప్రతిలో "మనము" అనే నామవాచకం "మనుషులము బంధువులము" అనే పదాలతో అన్వయ సంబంధం కలిగినదిగా కన్పిస్తుంది. ఈ పదాల భావం ఈ విధంగా ఉంటుంది: "మనుషులు కలహపడకూడదు. బంధువులు అసలు కలహపడకూడదు."[3] "సహోదరులు" (אַחִים, *'achim*) అనే పదము ఖచ్చితమైన ఆలోచనలో ఉపయోగించకూడదుగాని, "ఇంటివాడు" (ESV) లేక "బంధువు" (NLT) అని అనువదించబడాలి. ఏది ఏమైనా, అబ్రాహాము యొక్క సహోదరుని కుమారుడు అనగా సోదరుని కొడుకు లోతు (11:27). వయసులో పెద్దవాడైన అబ్రాహాము తనకు, వయసులో చిన్నవాడు మరియు బంధువు అయినటువంటి లోతుకు

మధ్య వివాదాలకు తావుగా ఉన్న పరిస్థితిని సామరస్యంగా పరిష్కరించి, ఇద్దరి మధ్య **కలహాల**న్నిటిని పూర్తిగా తొలగించాలనుకున్నాడు.

భయాందోళనలకు నెలవుగా ఉన్న ఈ పరిస్థితిని అబ్రాహాము వెంటనే పరిష్కరించడం ఐగుప్తులో అతను చేసినదానికి పూర్తిగా భిన్నంగా ఉంది. నైలు లోయలో అతనే వివాదానికి కారణమయ్యాడు. ఇప్పుడతను వివాదం ముదిరి హింసకు దారితీయకముందే వివాదాన్ని పరిష్కరించడానికి కార్యోన్ముఖుడయ్యాడు. ఐగుప్తులో అతను తన ఒక్కడి స్వంత లాభంకొరకు నడిచాడు, కనానుకు తిరిగి వచ్చిన తర్వాత తన లాభంకంటె ఎక్కువగా లోతు లాభంకొరకు ఉదారతతో కూడిన ఉదాత్తమైన నడవడి చూపించాడు. ఐగుప్తులో ఎదురైన భంగపాటు అతనికి పాఠం నేర్పి ఉండవచ్చని ఆశ్చర్యపడడం తప్ప మనకు ఏ వివరాలు తోడ్పడవు. కనానుకు వచ్చిన తర్వాత బేతేలులో బలిపీఠం నిర్మించి ప్రార్థన చేయడం, దేవునితో ఏర్పడిన అన్యోన్య సహవాసం (13:4) బహుశా అతని నిర్ణయాన్ని ప్రభావితం చేసి ఉండవచ్చు.

అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకుకు కూడా కలహము కంటె శాంతిని కోరుకొనమనే సందేశాన్నే అందించినట్లు కనబడుతుంది: తదుపరి కాలంలో ఇస్సాకు కూడా కలహానికి బదులు శాంతినే కాంక్షించాడు. గెరారు రాజైన అబీమెలెకు మందల కాపరులు బావులమీద హక్కుల విషయంలో కలహపడినప్పుడుఇస్సాకు ప్రతిఘటించలేదు. ఇస్సాకు న్యాయబద్ధంగా తనకున్న హక్కులకొరకు గట్టిగా పట్టుపట్టి ఉండవచ్చు, అయితే ఇది హింసకే దారి తీస్తుంది. ఇస్సాకు శాంతియుతంగా ప్రవర్తించి బావుల మీద తన హక్కుల్ని వదులుకొని తన సేవకుల్ని మరొక స్థలంలో బావులు త్రవ్వమని ఆదేశించాడు (26:18–22).

**వచనము 9**. అబ్రాహాము లోతులు **వేరుపడడం** తప్పనిసరి అయ్యింది కాబట్టి, ఎవరికి వారు తమ తమ కుటుంబాలతో ఆస్తి పాస్తులతో విడిపోవాలని, అబ్రాహాము తొలుత ప్రతిపాదించాడు. అతను మొదటి అవకాశాన్ని లోతుకే ఇచ్చి అతను వెళ్లవలసిన త్రోవను అతను నివసించాలనుకున్న స్థలాన్ని కోరుకొనమని అడిగాడు. పితరుడు తనకొరకు ఏ అవకాశాన్ని మిగుల్చుకొనక, ఇలా అన్నాడు, **ఈ దేశమంతయు నీ యెదుటనున్నది గదా? నీవు ఎడమతట్టునకు** [వెళ్లినయెడల] **నేను కుడితట్టుకును, నీవు కుడితట్టునకు వెళ్లిన యెడల నేను ఎడమ తట్టునకు** [వెళ్లుదును] అని ఆయన లోతుకు చెప్పెను.

ఇటువంటి ప్రకటన లోతుకు ఆశ్చర్యాన్ని కలిగించి ఉండవచ్చు. ఎందుకంటే పితృస్వామిక సమాజంలో వయోధికుడికి (తండ్రిగానీ, లేక పెదతండ్రిగానీ, చినతండ్రిగానీ) ముందుగా నిర్ణయం తీసుకొనే అధికారం (హక్కు) ఉంటుంది. వయసులో చిన్నవారు పెద్దవారికున్న హక్కును చట్టరీత్యా గౌరవించాలి. మరొక విషయం, యెహోవా ఈ దేశాన్ని అబ్రాహాము సంతానానికి ఇస్తానని వాగ్దానం ఛేశాడు (12:7). కాబట్టి, అబ్రాహాము ఈ కారణాన్నిబట్టి సహజంగానే తనకొరకు

తన సంతానంకొరకు తనకు వచ్చిన ప్రాంతాన్ని తాను కోరుకొని ఉండవచ్చు, పైగా ఇది ముందుకాలంలో లోతు వారసుల నుండి ఎటువంటి సమస్యల్ని తలెత్తనివ్వదు.

ఈ సందర్భంలో అబ్రాహాము ఉద్దేశానికి ప్రేరణ ఏమిటి? అబ్రాహాము తన బంధువులకు తానే ఆశీర్వాదంగా ఉండాలని ప్రయత్నించి ఉండవచ్చు. దేవుడు అబ్రాహామును పిలిచినప్పుడు "నీవు ఆశీర్వాదముగానుందువు" (12:2) అని ఆజ్ఞాపూర్వకంగా తెలిపాడు. అయితే గతంలో, అతను శారా విషయంలో తన కపటవర్తనద్వారా ఫరో ఇంటివారికి ఆశీర్వాదాలకు బదులు "శాపములు" (మహావేదనలు) కలిగేలా చేశాడు (12:17). బహుశా ఇప్పుడు అబ్రాహాము వాగ్దాన దేశంలో తన తమ్ముడి కుమారుడు ఎన్నుకున్న ప్రదేశాలు అతనికిచ్చి, అతనికి తానే "ఆశీర్వాదంగా ఉండాలని" తలంచి ఉండవచ్చు.

మరొక భావన, ఇది అబ్రాహాము విశ్వాసానికి సంబంధించిన చర్య. లోతు తనకు కావలసినవి ఎన్నుకొనేలా అబ్రాహాము అతనిపట్ల ఉదారతతో ప్రవర్తించడం, దేవుని సంకల్పం మరియు ఆయన ఉద్దేశాల విషయంలో అబ్రాహాముకు దేవునిమీద ఉన్న నమ్మకాన్ని సూచిస్తుండవచ్చు. హెబ్రీ పత్రిక రచయిత అబ్రాహాము గురించి వ్రాస్తూ "విశ్వాసమును బట్టి అతడును ... గుడారములలో నివసించుచు, అన్యుల దేశములో ఉన్నట్టుగా వాగ్దత్త దేశములో పరవాసులు" గా (హెబ్రీ 11:9) ఉన్నారని తెలియజేశాడు. మరొక మాటలో చెప్పాలంటే విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాము, లోతు ఎన్నిక చేసికొనని విశాలమైన భూభాగాల్లో సైతం తనకొరకు శాశ్వతమైన హక్కుల్ని కోరుకొనలేదు. దేవుని సమయంలో, దేవుని చిత్తప్రకారం దేశం గురించిన వాగ్దానం నెరవేరేలాగా అబ్రాహాము ఈ విషయాన్ని ఆయనకే వదిలిపెట్టాడు.

**వచనము 10. లోతు తన కన్నులెత్తి యొర్దాను ప్రాంతమంతటిని చూచెను, అదంతయు** సారవంతముగాను **నీళ్లు పారు దేశమై యుండెను.** యొర్దాను ప్రాంతం గురించి **యెహోవా సొదొమ గొమొఱ్ఱా అను పట్టణములను నాశనము** చేయక మునుపుఅని, గ్రంథకర్త తన పాఠకులకు తెలిసిన పరిస్థితుల్ని ఈ వచనంలోని సందర్భంతో అప్పటికి ఆ పరిస్థితులు లేనప్పటికీ వాటిని అన్వయిస్తూ వివరించాడు. సొదొమ గొమొఱ్ఱా పట్టణాల దుష్టత్వం అవి నాశనమయ్యేలా చేసింది (13:13; 19:1–29). యొర్దాను లోయలో యెరికో వంటి కొన్ని ప్రాంతాల్లోను, కొండ ప్రాంతాలైన మధ్య దేశంలోను విస్తారమైన వర్షాలవలన నీటిప్రవాహాలు వాగుల్లో నీరు ఉంటుంది కాబట్టి సారవంతమైన నేలల్లో పంటపొలాలు పండ్లతోటలు సమృద్ధిగా ఉంటాయి. అయితే, మైదానంలోని పట్టణాల్ని యెహోవా నాశనం చేయడంతో ఈ ప్రాంతంలో చాలా భాగం భూసారాన్ని కోల్పోయింది (19:1–29). పర్యావరణంలోను భూగర్భంలోను సంభవించిన కొన్ని మార్పులు, ఈ ప్రదేశం అబ్రాహాము కాలంలో పచ్చదనంతో సారవంతంగా ఉన్నట్టుగా నేటి కాలంలో

ఎందుకు లేదో వివరిస్తాయి.

**లోతు** ఈ ప్రదేశాన్ని చూచినప్పుడు, అతను తన మనసులో **యెహోవా తోట** (ఏదెను పరదైశు) సస్యశ్యామలంగా ఎలా ఉండేదో ఊహించుకున్నాడు (2:8–14; మరియు, యెష. 51:3; యెహెజ్కేలు 36:35 చూడండి). కరవు సమయంలో అబ్రాహాముతో బాటు ఐగుప్తు దేశానికి వెళ్లిన లోతు అక్కడ తాను చూచిన సమృద్ధమైన నీటి వనరుల్ని కూడా ఇప్పుడు జ్ఞాపకం చేసుకొని ఉండవచ్చు.

**సోయరుకు** వచ్చువరకు అనే పదాల వివరణ కష్టమే, ఎందుకంటే "సోయరు" ఎక్కడుందో ఇతమిత్థంగా తెలియదు. బహుశా ఇది మృతసముద్రం (ఉప్పు సముద్రం) దక్షిణ కొనలో[4] సొదొమ గొమొఱ్ఱా పట్టణాలకు దగ్గరలోనే ఒకప్పుడున్న పట్టణం కావచ్చు (14:2, 8, 19:22–24, 30).[5]

**వచనము 11**. లోతు ఎన్నిక తన కళ్లు ఏం చూశాయో వాటిమీద ఆధారపడిన ఎన్నిక. అతడు తనకు **యొర్దాను ప్రాంత మంతటిని ఏర్పరచుకొని తూర్పుగా ప్రయాణము చేసెను** అని లేఖనం చెబుతున్నది. అంటే, తన పరివారమంతటితో వెళ్లి అక్కడ స్థిరపడ్డాడని అర్థం. లోతు కచ్చితంగా ఎక్కడ నివసించాడో ఏకాభిప్రాయం లేదు; సూచనలు మటుకు దిక్సూచిలోని నాలుగు వైపులకు అంటే మృతసముద్రపు ఉత్తరం తూర్పు దక్షిణం పడమర దిశలకు ఉన్నాయి. చివరకు, లోతు నివసించిన ప్రాచీన సొదొమ వాస్తవానికి మృతసముద్రపు దిగువ భాగంలో ఉంది కాబట్టి అది నేడు కనబడు.[6]

ఈ విధంగా, అబ్రాహాము లోతులు **విడిపోయారు**. ఆ కాలంలో కనాను సరిహద్దులేవో స్పష్టంగా తెలియడంలేదు. తదుపరి కాలంలో, అంటే మోషే కాలంలో వాగ్దాన దేశపు సరిహద్దుల గురించి సంఖ్యా 34:1–12లలో వివరంగా ఉంది; యొర్దానుకు తూర్పు ప్రదేశం మరియు పడమరనున్న ప్రదేశం కూడా వాగ్దానదేశంలోనిదే. అయితే, ఆదికాండము 13వ అధ్యాయంలోని కనానులో యొర్దాను పడమర ప్రాంతం ఒకటే ఉంది. (13:10, 12). కాబట్టి లోతు తూర్పువైపు ప్రయాణం చేశాడనడంలో అతను కనాను చివరివరకు వెళ్లి ఉండవచ్చు. బహుశా కనానును దాటి కూడా ఉండవచ్చేమో. 10:19 ప్రకారం సొదొమ గొమొఱ్ఱా పట్టణాలు, ఇంకా మైదానంలోని ఇతర పట్టణాలు కనాను సరిహద్దుల్లో ఉన్నాయి. లోతు కొండప్రాంతాలైన మధ్యప్రదేశం నుండి తూర్పువైపు ప్రయాణించినప్పుడు, అతను వాస్తవంగా వాగ్దాన దేశానికి ప్రతికూల దిశలో వెళ్తున్నాడని అర్థం. తదుపరి కాలంలో అతని వారసులైన మోయాబీయులు అమ్మోనీయులు యొర్దాను తూర్పువైపున నివసించారు. లోతు అబ్రాహామునుండి విడిపోయి తూర్పువైపు ప్రయాణించడం అతను యెహోవా ఆశీర్వాదం నుండి తొలగి పోతున్నాడని, యెహోవా శపించే ప్రదేశానికి వెళ్తున్నాడని 14:12 మరియు 19:12–26 వచనాలు స్పష్టం చేస్తున్నాయి.

**వచనము 12**. లోతుతీసుకున్న నిర్ణయం ఆధారంగా, **అబ్రాహాము కనానులో**

**స్థిరపడెను, మరియు లోతు మైదానమందున్న పట్టణముల ప్రదేశములో కాపురముండెను** అని వాక్యభాగంలో ఉంది; అని ఉంది. కాపురముండు, "నివసించు" అనే పదాలకు హెబ్రీ భాషలో ఈ సందర్భంలో ఉపయోగించిన (יָשַׁב, *yashab*) అనే పదం ఏదైనా ఒక ప్రదేశంలో శాశ్వతంగా "నివసించడమనే" అర్థాన్నివ్వదు. అబ్రాహాము "విశ్వాసమునుబట్టి" కనానులో నివసించాడు. అయితే ఒక చోటనుండి మరొక చోటుకు మారుతూ కనానులోనే "గుడారములలో నివసించాడు" (హెబ్రీ 11:9). లోతు విషయంలో కూడా ఇది నిజమే; ఒక చోటునుండి మరొక చోటుకు మారుతూ, చివరికి **సొదొమ దగ్గర వరకు తన గుడారము వేసుకున్నాడు**. బహుశా అతి త్వరలోనే అక్కడి పట్టణజీవితం అతణ్ణి ఆకర్షించి ఉండవచ్చు. సొదొమ వెలుపల కాకుండా, సొదొమ పట్టణంలోనే తన కుటుంబంతో నివసించాడు (14:12).

**వచనము 13**. సరిగ్గా ఇక్కడే గ్రంథకర్త తన పాఠకులకు మరొక ముఖ్యమైన వేదాంత వివరణను హఠాత్తుగా (ఉన్న పళంగా) పొందుపర్చాడు: **సొదొమ మనుష్యులు దుష్టులును, యెహోవా దృష్టికి బహుపాపులునై యుండిరి**. ఈ ప్రకటన లోతు సొదొమ ప్రాంతాన్ని ఎన్నుకొనడంలోని అవివేకాన్ని వివరిస్తున్నది. అతను యొర్దాను ప్రదేశంలోని సారవంతమైన నేలల్ని, ఆర్థిక ప్రయోజనాల్ని చూచి ఆకర్షితుడయ్యాడు గానీ, దుష్టత్వంతోను పాపంతోను నిండిన అక్కడి ప్రజల జీవనవిధానాన్ని పరిగణనలోకి తీసుకొనలేదు. సొదొమ పట్టణస్థుల జీవనవిధానం గురించి వారు "దుష్టులు" (רַע, *ra'*) అని వర్ణించబడింది. జలప్రళయానికి పూర్వం జీవించిన తరంగురించి వివరించిన వర్ణనాత్మకమైన పదం కూడా ఇదే (6:5; 8:21). లేఖనభాగం సొదొమ పట్టణస్థుల గురించి మరింత వివరంగా యెహోవా "... దృష్టికి బహు పాపులునై యుండిరి" అని తెలియజేస్తుంది. నేటి ప్రపంచంలో ఇది వింతగా కనబడవచ్చు, ఇద్దరు వ్యక్తులు ఏకాభిప్రాయంతో చేసే ఏ పనైనా తప్పుగానీ "పాపము" గానీ కాదని ఆధునిక సమాజంలో బలంగా ఉన్నవాదం. సాటి మనిషిపట్ల పాపం చేయడమనేది ఉంటుందని ఒప్పుకొనే అనేకులు, ఆ పనులు దేవుని దృష్టిలోకూడా పాపమేనని ఒప్పకొనడానికి సమ్మతించరు. గ్రంథకర్త ఈ సమయంలో సొదొమ పట్టణస్థుల దుష్టక్రియల గురించి సవివరంగా తెలియజేయనప్పటికీ; ఈ ప్రస్తావన సొదొమ పట్టణానికి, ఇంకా మైదానంలోని తక్కిన పట్టణాలకు ఆయా పట్టణస్థుల వికృతమైన దుష్టక్రియల్ని బట్టి సర్వనాశనం పొంచి ఉందనే భావనను సూచనప్రాయంగా తెలియజేస్తుంది. వీరి దుష్టక్రియల గురించి, వాటి పర్యవసానం గురించి 19వ అధ్యాయంలో పూర్తి వివరాలున్నాయి.

## దేవుడు దేశమును గూర్చిన వాగ్దానమును నూతనపరచుట మరియు అబ్రాహాము ప్రతిస్పందన (13:14–18)

**14లోతు అబ్రాహామును విడిచిపోయిన తరువాత యెహోవా– ఇదిగో నీ కన్నులెత్తి నీవు ఉన్నచోటునుండి ఉత్తరపు తట్టు పడమర తట్టును చూడుము. 15ఎందుకనగా నీవు చూచుచున్న యీ దేశమంతటిని నీకును నీ సంతానమునకును సదాకాలము ఇచ్చెదను. 16మరియు నీ సంతానమును భూమిమీద నుండు రేణువుల వలె విస్తరింప చేసెదను. ఎట్లనగా ఒకడు భూమిమీద నుండు రేణువులను లెక్కింప గలిగినయెడల నీ సంతానమును కూడా లెక్కింపవచ్చును. 17నీవు లేచి యీ దేశము యొక్క పొడుగున వెడల్పున దానిలో సంచరించుము; అది నీకిచ్చెదనని అబ్రాముతో చెప్పెను. 18అప్పుడు అబ్రాము తన గుడారము తీసి హెబ్రోనులోని మమ్రే దగ్గరనున్న సిందూరవృక్ష వనములో దిగి అక్కడ యెహోవాకు బలిపీఠమును కట్టెను.**

లోతు యొర్దాను మైదాన ప్రాంతంలోనికి వెళ్లిన తర్వాత, దేవుడు మళ్లీ అబ్రాహాముతో మాట్లాడాడు. ఆయన అంతకు ముందే అబ్రాహాముకు అతని సంతానానికి కనాను దేశాన్నిస్తానని వాగ్దానం చేశాడు (12:7). ఈ సందర్భంలో దేవుడు దేశం గురించి వాగ్దానాన్ని పునరుద్ఘాటించి చెబుతూ లెక్కకు మించిన సంతానాన్నిస్తానని వాగ్దానం చేశాడు.

**వచనములు 14, 15**. లోతు "తన కన్నులెత్తి" సారవంతమైన కనాను పరిసరాల్ని, అవతలి ప్రదేశాల్ని కూడా చూశాడు; ఇవన్నీ అతని కళ్లకు సంతృప్తికరంగా కన్పించడం అతను స్వార్థపూరితమైన మరియు విషాదాంతమైన నిర్ణయం తీసుకొనేలా చేసింది (13:10, 11). లోతు నిర్ణయం తరవాత యెహోవా **అబ్రాహాముతో కనాను దేశమంతా, నీ కన్నులెత్తి నీవు ఉన్నచోటనుండి ఉత్తరపు తట్టు దక్షిణపు తట్టు తూర్పు తట్టు పడమర తట్టును చూడుము** అని చెప్పాడు. అబ్రాహాము సంతానానికి ఈ **దేశం** ఎప్పటికీ (עוֹלָם, *'olam*) దేవుని నుండి కలిగిన ఆశీర్వాదకరమైన బహుమానంగా ఉండేలాగా, అతని నిర్ణయాలు అతని విషయంలోను, అతని సంతానం విషయంలోను దేవుని ప్రణాళిక (కార్యాచరణ) మీద, దేవుని ఉద్దేశాల మీద నిలిచి ఉండేలాగా దేవుడు అబ్రాహాముకు మార్గనిర్దేశం చేస్తున్నాడు.

పదిహేనవ వచనం అనువాదం జటిలంగా కనబడుతుంది; ఎందుకంటే అబ్రాహాము సంతానం వాగ్దానదేశాన్ని "సదాకాలము" ఎటువంటి షరతుల్లేకుండా ఎటువంటి ఉపసంహారణలు (రద్దులు) లేకుండా దేవుని నుండి బహుమతిగా పొందవచ్చని బైబిలు విద్యార్థుల ఆలోచన. ఈ అభిప్రాయం క్రైస్తవుల్లో చాలా ముఖ్యమైన వేదాంతపరమైన వివాదానికి, ఇంకా, పశ్చిమ ఆసియాలో

యూదులకు ముస్లిములకు మధ్య రాజకీయపరంగా సైనికపరంగా తీవ్రమైనే సమస్యలకు కారణమైంది. అబ్రాహాము సంతానానికి (ఇశ్రాయేలీయులు) కనాను దేశం స్వాస్థ్యంగా ఉండే కాలవ్యవధి గురించి "సదాకాలము" అనే పదం సహాయకరమైన అనువాదం కాదు. *'Olam* అనే పదానికి అనిర్ణీత కాలవ్యవధిని సూచించే "సుదీర్ఘకాలం" లేక "కలకాలం లేక చిరస్థాయిగా నిలిచే" అనే పదాలు మేలైన అనువాదంగా ఉంటాయి.[7] ఇశ్రాయేలీయులకు వాగ్దానదేశం స్వాస్థ్యంగా ఉండడం, యెహోవా పట్ల వారికున్న విధేయత మీద ఆధారపడి ఉంటుందని అనేక వాక్యభాగాలు సూచిస్తున్నాయి.

ఇశ్రాయేలీయులు కనానులోకి ప్రవేశించడానికి పూర్వం మోషే వారిని, వారు దేవుని నిబంధననుండి తొలగిపోయి (పది ఆజ్ఞలు కూడా కలుపుకొని), అసత్య దైవాల్ని ఆరాధించినట్లయితే వాగ్దాన దేశాన్ని కోల్పోతారని మళ్లీ మళ్లీ హెచ్చరించాడు (ద్వితీ. 6:10–15; 11:8, 9; 28:15–21, 36, 37, 58–65). ప్రజలు ఏం చేయకూడదో మోషే వారికి గుర్తుచేస్తూ, దేవుని వాగ్దానంయొక్క నిశ్చయాత్మక పార్శ్వాన్ని కూడా నొక్కి చెప్పాడు. వారు యెహోవాను ప్రేమించాలి, ఆయన మాటలకు విధేయత చూపాలి, ఆయనను విడిచి పెట్టకుండా ఉండాలి. "నీ పితరులైన అబ్రాహాము ఇస్సాకు యాకోబులకు ఆయన ప్రమాణము చేసిన దేశములో మీరు నివసించునట్లు యెహోవాయే మీ ప్రాణమునకును మీ దీర్ఘాయుష్షుకును మూలమై యున్నాడు. కాబట్టి నీవును నీ సంతానమును బ్రదుకుచు, నీ ప్రాణమునకు మూలమైన నీ దేవుడైన యెహోవాను ప్రేమించి ఆయన వాక్యమును విని ఆయనను హత్తుకొనునట్లును జీవమును కోరుకొనుడి" (ద్వితీయోప. 30:20) అని మోషే చెప్పాడు.

**వచనము 16**. ఈ వచనానికి ముందు అబ్రాహాము "సంతానానికి" సంబంధించిన ప్రకటనలు సుస్పష్టంగా కాక, సాధారణ భావనలో కనబడుతున్నాయి. "గొప్ప జనము" (12:2) అనే వాగ్దానం కూడా ప్రాచీన కాలంలో అంత ముఖ్యమైనదిగా కనబడదు. ఎందుకంటే ఏదైనా ఒక చిన్న సమూహాన్ని కూడా ఆ కాలంలో గొప్పదిగానే భావించేవారు. అయితే ఇక్కడ దేవుడు, పితరుని సంతానంయొక్క విస్తారమైన సమూహం అనే భావనను వ్యక్తం చేస్తూ పోలిక (ఉపమాలంకారము) నుపయోగించాడు: ఆయన అబ్రాహామునియొక్క **సంతానమును** ఎవరూ **లెక్క పెట్టలేనంత** విస్తారంగాభూమి మీద నుండు **రేణువుల వలె చేసే తన ప్రణాళిక** (కార్యాచరణ) గురించి వెల్లడి చేశాడు (15:5; 22:17; 26:4; 28:14; 32:12 చూడండి.

**వచనము 17**. ఇంకా యెహోవా అబ్రాహాముతో, **యీ దేశము యొక్క పొడుగున వెడల్పున దానిలో సంచరించుము** అని చెప్పాడు; బహుశా ప్రాచీన పశ్చిమ ఆసియాలో కొందరు రాజులు తమ "యజమాన్యాన్ని సూచించడానికి" ఈ విధంగా చేసి ఉండవచ్చు.[8] ఇదెలా కార్యరూపంలోకి రాబోతుందో యెహోవా

వివరించలేదు. అబ్రాహాముకు ఆ దేశం కనానీయుల స్వాధీనంలో ఉందని, శారా గోడ్రాలని బాగా తెలుసు. అతను చేయగలిగిన పని విశ్వాసంతో అడుగు ముందుకు వేస్తూ యెహోవా కార్యం కొరకు వేచి చూడడం మాత్రమే.

**వచనము 18.** అబ్రాము తాను పొందబోయే ప్రాంతాన్నంతా సంచరించి **చూచిన తర్వాతగుడారము తీసి వేసి, హెబ్రోనుకు**[9] **ఉత్తరం వైపు** (23:19; 25:9) సుమారు రెండు మైళ్ల దూరంలో నెగావులోని మమ్రే దగ్గరనున్న సిందూరవృక్ష వనములోనివసించాడు. మమ్రేకు ఆ పేరు ఒక అమోరీయుడివలన ఏర్పడింది (14:13 చూడండి); ఇతను తన సహోదరులతో బాటుగా తదుపరి కాలంలో, అబ్రాహాము మెసొపొతమియలోని నలుగురు రాజుల్ని ఓడించి లోతును సొదొమ ప్రజల్ని విడిపించడంలో అతనికి సహాయం చేశాడు (14:14–16). అబ్రాహాము కనానులో ఉన్న అన్యప్రజలతో స్నేహపూర్వకంగా ఉన్నప్పటికీ, అతను ఆరాధన కొరకు ఏ అన్యదేవతల బలిపీఠాల దగ్గరకు వెళ్లలేదు. దేవుణ్ణి ఆరాధించడానికి అతను కనానీయుల ఆరాధనా స్థలాలవైపు చూడకుండా ఇంత క్రితం "అక్కడ" అతను చేసిన విధంగానే **యెహోవాకు బలిపీఠమును నిర్మించాడు** (12:7, 8) దేవుడు తనను విస్తారంగా ఆశీర్వదించినందుకు, తన సంతానం వాగ్దాన దేశాన్ని స్వాధీనపర్చుకొని విస్తరించి వర్ధిల్లుతుందనే వాగ్దానాన్ని బట్టి అతను దేవునికి కృతజ్ఞత చెల్లించాలని కోరుకున్నట్టు మనం భావించవచ్చు.

## అన్వయము

### ఆశీర్వాదములలోని "అపాయం" (అధ్యా. 13)

దేవుని నుండి సమృద్ధిగా లభించినవి ఆశీర్వాదాలకైనా, లేదా శాపాలకైనా దారితీస్తాయి. ఆదినుండి, దేవుడు తన ప్రజల్ని ఆశీర్వదించాలని మాత్రమే కోరుకుంటున్నాడు. ఆయన వారి ప్రతి అవసరం కొరకు కావలసిన వాటినన్నిటినీ సమృద్ధిగా వృద్ధి చేశాడు. ఆయనొక అందమైన లోకాన్ని సృష్టించి, ఆదాము హవ్వలను పరిపూర్ణమైన పర్యావరణంలో ఉంచాడు. అది, భౌతిక జీవనానికి అవసరమైన ఆహారంకొరకు వివిధ జాతుల పండ్ల వృక్షాలు చెట్లు సమృద్ధియైన నీటివసతి ఉన్న అందమైన పరదైసు వంటి తోట. నిషేధించబడినవి ఒకే ఒక చెట్టు ఫలాలు, మంచి చెడ్డల తెలివినిచ్చే చెట్టుయొక్క ఫలాలు మాత్రమే; ఇది మరణానికి దారి తీస్తుందని దేవుడు హెచ్చరించాడు. అయితే, దేవుడు నిజంగా తన హృదయంలో ఆదాము హవ్వలకు శ్రేష్ఠమైన ప్రయోజనాలివ్వాలని కోరుకొనడంలేదని సర్పం నేర్పుగా ప్రవేశపెట్టింది. దేవుడు దీన్ని ఆపడం, ఆయన అత్యంత ముఖ్యమైన ఆశీర్వాదాన్ని తమకు ఇవ్వకుండా ఉండటం కొరకేనని వారు నమ్మడం జరిగింది. వారు దేవునిలాగా ఉండాలని, దానితో బాటుగా జ్ఞానం శక్తి

అత్యంత మేలైన భాగ్యం (శ్రేయస్సు, ఈవి) మొదలైనవన్నీ పూర్తిగా తాము పొందాలని కోరుకున్నారు.

కాకపోతే మనిషి ఒక భౌతికజీవిగా అన్ని ఆశీర్వాదాల్ని పొందలేడని, తాను స్వయంగా దేవుడు కాలేడని దేవునికి తెలుసు. ఒక వేళ అవన్నీ సాధ్యపడినా, భౌతికమైన సంపాద్యాలు ఆశీర్వాదాలు శాశ్వతమైన సంతోషాన్ని సంతృప్తిని క్షేమాన్ని ఇవ్వలేవు. పైపెచ్చు, దేన్నైనా పొందుతున్న కొలదీ, ఇంకా ఎక్కువగా పొందాలనుకొనడం మనిషి నైజం. భౌతికమైన ఆశీర్వాదాలపట్ల మనిషికున్న పిపాస లేక తృష్ణ (వాంఛ, ఇచ్ఛ) ఎన్నటికీ పరితృప్తి చెందదు. అలాగని, సంపదలు, సంపాద్యాలు చెడ్డవేమీ కావు; వాస్తవానికి అవి కుటుంబ అవసరాలకు, లోకంలో నిర్భాగ్యుల అవసరాలకు ఉపయోగపడినట్లయితే మంచివే. ఏమైనప్పటికీ, సంపదల్ని సంపాద్యాల్ని ప్రేమించడం, వాటికొరకు స్వార్థంగా ఉండడం, పైగా ఇంకా ఏం కొనాలి ఏం పొందాలి అనేదాని కొరకే జీవించడంవంటి శోధనలెప్పుడూ పొంచి ఉంటాయి కాబట్టి అవి ప్రమాదకరమైనవి కూడా.

ప్రజలకు సరైన ప్రాధాన్యతలులేకపోవడంవలన లేక తెలియపో వడంవలన, ధనాపేక్ష పలు కుటుంబ వివాదాలకు కారణమవుతున్నది; పైగా కుటుంబాల్ని విచ్ఛిన్నం చేస్తున్నది. ఇంకా సంపాదించాలనే కోరికతో, సంపాదనతో వచ్చే పలుకుబడి (వ్యక్తిగత ఆధిక్యత) కావాలనే మితిమీరిన కోరికతో ప్రజలు తమ జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారు. తాము కోరుకున్న ఈ లక్ష్యాల్ని సాధించడం కొరకు ఎటువంటి అనైతిక చర్యలు అవినీతి పనులు చేయవలసి ఉంటుందనేదాన్ని కూడా లెక్క చేయడం లేదు. సంపదలపట్ల అధికారంపట్ల ఎన్నటికీ చల్లారని తృష్ణతో రగిలిన నాయకుల వలన వేలాదిమంది మనుషులు యుద్ధాల్లో మరణించారు.

"మనమీ లోకములోనికి ఏమియు తేలేదు, దీనిలోనుండి ఏమియు తీసికొని పోలేము. కాగా అన్నవస్త్రములు గలవారమైయుండి వాటితో తృప్తి పొందియుందము" (1 తిమోతి. 6:7, 8) అని పౌలు తిమోతికి గుర్తు చేశాడు. ఇంకా అపొస్తలుడు ధనంవలన కలిగే అపాయాల్ని గురిపెట్టి చూపించాడు (1 తిమోతి. 6:9) ధనం దానంతటఅది మనుషుల జీవితాల్ని నాశనం చేయదు గానీ, "ధనాపేక్ష" నాశనం చేస్తుందని పౌలు చెప్పాడు. ధనాపేక్ష "సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమోతి. 6:10; మరియు, మత్తయి 6:19–24; లూకా 12:15–21; 1యోహాను 2:15–17 చూడండి). జ్ఞానం (ప్రాపంచిక జ్ఞానం), పలుకుబడి (అధికారం), సంపదలు సంపాద్యాలు మొదలైనవాటిని ప్రేమించడమనేది ఒక రకమైన శోధనయే; పదమూడవ అధ్యాయం ప్రారంభంలో అబ్రాహాము లోతులకు ఇటువంటి శోధనే ఎదురైంది.

*సంపదలు సంపాద్యాలు వివాదాలకు దారితీస్తాయి* (13:1–7). అబ్రాహాము

ఐగుప్తునుండి తిరిగి వచ్చినప్పుడు అతని నిజంగానే ధనవంతుడు. అతను హారాను నుండి కనానుకు బయలుదేరేటప్పటికే పశువుల మందలు దాసదాసీజనం ఉన్న ధనవంతుడని మనకు తెలుసు; అబ్రాహాము ఇంట్లోనే పుట్టి యుద్ధవిద్యలో అభ్యాసంపొందిన మూడువందల పద్దెనిమిది మంది మనుషులు అతనికున్నారు (14:14). ఫరో శారా గురించి ఆమె అబ్రాహాము భార్య కాదని, ఆమె అతని సహోదరి అనుకొనేలాగా అతను కపటపు మాటలతో ఫరోను మోసగించినప్పటికీ, అబ్రాహాము ఐగుప్తును విడిచిపెట్టి వెళ్లేటప్పుడు ఫరో అబ్రాహాముకిచ్చిన పశువుల మందల్ని గొర్రెల మందల్ని దాసదాసీ జనాన్ని వెండి బంగారాల్ని అతను తనతో బాటు తీసుకొని వెళ్లడానికి ఫరో అనుమతించాడు (12:16, 20). అబ్రాహాము కనానుకు తిరిగి వచ్చినప్పుడు అతను "బహు ధనవంతుడై యుండెను" అని లేఖనం తెలియజేస్తుంది (13:1, 2).

అలాగే లోతు కూడా సంవత్సరాలు గడిచే కొద్దీ అభివృద్ధి చెంది భాగ్యవంతుడయ్యాడు. లోతు ఐగుప్తునుండి తిరిగి వచ్చినప్పుడు అతనికి కూడా "గొఱ్ఱెలు, గొడ్లు, గుడారములు" ఉన్నాయి (13:5). "గుడారములు" అనే పదం లోతుకున్న పశువుల్ని సంరక్షించ డానికి అతని సంపాద్యాల్ని కాపాడడానికి అతని దగ్గర అనేకమంది పశువుల కాపరులున్నారని సూచిస్తుంది. వాస్తవానికి, ఇద్దరి గొఱ్ఱెల మందలు పశువుల మందలు ఎంత విస్తారంగా ఉన్నయంటే "వారు కలిసి నివసించుటకు ఆ ప్రదేశము చాలక" పోయినంత విస్తారంగా ఉన్నాయి (13:6). ఇది, "అబ్రాహాము పశువుల కాపరులకును లోతు పశువుల కాపరులకును కలహము" పుట్టడానికి దారి తీసింది (13:7). బంధువులైన వీరిద్దరు (అబ్రాహాము సోదరుని కుమారుడు లోతు) కలిసి ఉండలేక పోవడానికి అప్పటికే అక్కడున్న కనానీయులు పెరిజ్జీయులు మేతభూముల్ని ఆక్రమించుకొని ఉన్నందువల్ల, వీరిద్దరి పశువుల మందలకు గొఱ్ఱెల మందలకు అవసరమైన పచ్చిక ఉన్న మేత భూములు లేకపోవడం కూడా ఒక కారణమయ్యుండవచ్చు (13:7).

పశువుల మేత కొరకు నీటి వసతి కొరకు పోటీ కారణంగా అబ్రాహాముకు లోతుకు తీవ్రమైన సమస్య ఎదురైంది; ఇది వారి గొఱ్ఱెల మందలకు పశువుల మందలకు అపాయం కలిగించడంతో బాటు, పశువుల కాపకులకు వారి కుటుంబాలకు కూడా అపాయాన్ని కలిగించింది. అబ్రాహాముకు లోతుకు ఈ వివాదంలో ఎంత మేరకు ప్రమేయం ఉందో లేఖనం తెలియజేయడంలేదు గానీ, ప్రతిఘటన హింసాత్మకంగా మారినట్లయితే ఇది వ్యక్తిగతంగా ఇద్దరికీ, ఇద్దరి దాసదాసీనానికి దారుణమైన (ఘోరమైన, విపత్కరమైన పరిణామాల్ని కలిగించి ఉండేది. భిన్న జాతులకు చెందిన ఇరువర్గాల దాసదాసీజనం మధ్య (అబ్రాహాము లోతులకు మొదటనుండి ఉన్న దాసదాసీ జనం, ఫరో బహుమానంగా ఇచ్చిన దాసదాసీజనం) అసూయా ద్వేషాలున్నందువలన ఒంటరిగా ఉన్న వీరి మీద

కనానీయులు పెరిజ్జీయులు చాలా అనువుగా దాడిచేయ గలరు. బలమైన శత్రువుల్ని కలిసి ఓడించడానికి ఐక్యత లేకపోవడంవలన వారు తేలిగ్గానే ఓడిపోయి ఉండేవారు.

శరీర కార్యాలలో ఒకటైన "కలహము," ద్వేషములు" "మత్సరములు" "క్రోధములు" మొదలైనవాటితో బాటుగా కనబడుతుంది (గలతీ. 5:20). ఇవి ప్రేమే ఆధిక్యంగా ఉన్నటువంటి ఆత్మఫలానికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి (గలతీ. 5:22, 23). సామెతలు గ్రంథంలో "పగ కలహమును రేపును ప్రేమ దోషములన్నిటిని కప్పును" (సామెతలు 10:12) అని, "పేరాస గలవాడు కలహమును రేపును" (సామెతలు 28:25) అని ఒక జ్ఞాని వ్రాసిన మాటల్లో ఇటువంటి పరిశీలనే కనబడుతుంది. ద్వేషం మత్సరం క్రోధం మొదలైన శరీర కార్యాలైన పాపాల వెనుక ప్రేమ లేకపోవడమే ప్రధాన కారణమని లేఖనాలు చాలా స్పష్టంగా బోధిస్తున్నాయి. ఈ వైఖరులు కలహానికి దారి తీసి, అన్ని విధాలుగా మానవ సంబంధాల్ని భంగపరుస్తాయి.

*విశ్వాసం ద్వారా నడిచేవారు తమ చర్యల ద్వారా సమాధానపర్చే సజ్జనులుగా ఉండగలరు* (13:8, 9) అబ్రాహాము ఇబ్బందులు పెట్టువానిగా ఉండటం కంటే శాంతిప్రియుడుగానే ఉండాలని నిర్ణయించుకున్నాడు; అయితే అది మూల్యంతో కూడిన నిర్ణయం. అబ్రాహాము, మరణించిన తన సోదరుడు హారాను కుమారుడైన లోతుకు పెదతండ్రిగా తండ్రి స్థానంలో ఉన్నాడు. ఈ స్థానం అబ్రాహాముకు తాను కోరుకున్న భూభాగాన్ని తానుగానీ తనవారు గానీ పొందే హక్కును ఇచ్చినప్పటికీ, వాస్తవంగా అతను అంతవరకు ఎవరూ విననటువంటి పని చేశాడు; అది, వయోధికుడిగా తన హక్కును వదులుకొని, ఉదారతతో లోతు తనకు కావలసినవి ఎన్నుకునేలా అనుమతించడం.

"మనము బంధువులము గనుక నాకు నీకును ... కలహముండ కూడదు" (13:8) అని అబ్రాహాము చెప్పిన సందర్భంలో "కలహము" అని అనువాదమైన పదం מְרִיבָה (*$m^{e}ribah$*). తదుపరి కాలంలో ఈ పదం ఇశ్రాయేలీయుల విషయంలో వారికి అరణ్యంలో త్రాగడానికి నీరు దొరకని సందర్భంలో ముఖ్యమైనదిగా కనబడుతుంది. ప్రజలు మోషేకు వ్యతిరేకంగా "వాదము"తో (רִיב, *rib*), లేక కలహంతో దేవుణ్ణి శోధించారని నిర్గమ. 17:7 తెలియజేస్తుంది. ఇశ్రాయేలీయులు యెహోవాతో కలహపడడాన్ని వర్ణించడానికి *$m^{e}ribah$* అనే పదాన్నే ఉపయోగించడం జరిగింది. ఈ పదం ఆయనతో వారి తీవ్రమైన వివాదాన్ని లేక పట్టువదలని వాదనను తెలియజేస్తుంది. వారు తమ హృదయాల్ని కఠినపరచుకున్నందువలన ఈ విధంగా ప్రవర్తించారని కీర్తనకారుడు తెలియజేశాడు (కీర్తనలు 95:8). తన మందల కాపరులకు లోతు మందల కాపరులకు మధ్య తీవ్రమైన వివాదాలు హింసాత్మకంగా పరిణమిస్తాయని అబ్రాహాము గుర్తించినందువలన, అవి జరగకుండా ఉండడానికి అబ్రాహాము వెనువెంటనే చర్య

తీసుకున్నాడు.

అబ్రాహాము, ఒకరి స్వార్థంకంటె ఒకరి స్వంతప్రయోజనంకంటె బంధువుల మధ్య సమాధానం ఉండటం చాలా ముఖ్యమని నిర్ణయించుకున్నాడు. తదుపరి కాలంలో యేసు తన జీవితంలో దీన్నే ఆచరించి చూపించాడు; ఫిలిప్పీలో కొందరు క్రైస్తవుల మధ్య కక్షపూరితమైన వివాదాలున్నపుడు పౌలు ఈ సమాధాన వైఖరినే ప్రోత్సహించాడు. వారు ఒకరిపట్ల ఒకరు ప్రేమతో ఏకభావం కలిగి ఉండాలని "కక్షచేతనైనను వృథాతిశయము చేతనైనను" ఏమీ చేయకూడదని పౌలు అభ్యర్థన (ఫిలిప్పీ. 2:3). ఇంకా, వారిలో ప్రతి ఒక్కరూ "తన సొంతకార్యములను మాత్రమేగాక ఇతరుల కార్యములను కూడ" చూడాలని పౌలు వారిని హెచ్చరించాడు (ఫిలిప్పీ. 2:4). పౌలు, దీనత్వానికి నిస్వార్థానికి యేసునే అత్యంత శ్రేష్ఠమైన ఆదర్శంగా చూపిస్తూ, ఆయన తండ్రితో సమానంగా ఉండడాన్ని విడిచిపెట్టకూడని భాగ్యంగా ఎంచుకొనలేదని చెప్పాడు. ఆయన పరలోకంలో తనవి అయినటువంటి ఆధిక్యతను (శ్రేష్ఠత), శక్తిని (అధికారాన్ని), మహిమను విడిచిపెట్టి, భూమ్మీదకు మానవుడిగా వచ్చి మనుషులందరి పాపాలకొరకు సిలువ మరణం పొందడానికి ఇష్టపడెను (ఫిలిప్పీ. 2:5–8; మరియు, 1 యోహాను 2:1, 2 చూడండి).

*వెలిచూపుతో నడిచేవారు తరచుగా సులభంగా మోసపోయి దుర్ఘటన పాలవుతారు* (13:10–13). అబ్రాహాముతో పోలిస్తే లోతు చాలా మటుకు భిన్న స్వభావం కలిగిన వ్యక్తి. వయోధికుడు మరియు పెదతండ్రి అయిన అబ్రాహాము శాంతిప్రియుడుగాను, వయసులో చిన్నవాడు అబ్రాహాము సోదరుని కుమారుడైన లోతు ఇబ్బందులు సృష్టించుటలో తలదూర్చేవాడిగాను కనబడతారు. తక్కువలో తక్కువగా, లోతు ఎక్కడికి వెళ్లినా అతను జీవించినంత కాలం అతనికి ఇబ్బందులెదురవుతూనే ఉన్నాయి. లోతు చెడ్డవాడేమీ కాడు; భిన్నంగా, సొదొమ ప్రజల దుష్టత్వంతో పోలిస్తే అతను "నీతిమంతు"డని (2 పేతురు 2:7–9) వర్ణించడం జరిగింది. అయితే, లోతు ఒకదాని తర్వాత ఒకటిగా చెడు (తప్పు, మంచివి కాని) నిర్ణయాలు తీసుకున్నాడు; వీటికి కారణం అతని హృదయం ఒకదానిమీద నిలబడకపోవడం. అతను "దేవునికిని సిరికిని" (మత్తయి 6:24) దాసుడుగా ఉండాలని ప్రయత్నించిన ఫలితంగా, చివరికి "నేత్రాశ"కు (1 యోహాను 2:16) లొంగిపోయాడు.

లోతు గురించి ఈ సమగ్ర పరిగణన (మూల్య నిర్ధారణ) కచ్చితమైనదే; ఎందుకంటే అతను "తన కన్నులెత్తి యొర్దాను ప్రాంతమంతటిని చూసెను ... అదంతయు యెహోవా తోటవలెను ... నీళ్లు పారు దేశమై ఉండెను" (13:10) అని లేఖనం మనకు తెలియజేస్తున్నది. అతను హరిత వర్ణంలో సారవంతంగా కనబడిన భూమిని వద్దనుకొనలేక, "సొదొమ దగ్గర తన గుడారము వేసి" కొన్నాడు (13:12). యొర్దాను మైదానంలో అప్పటికే ఎటువంటి ప్రజలు నివసిస్తున్నారనే

విషయంగురించి, భక్తిపూర్వకంగా జీవించాలనుకొనే విశ్వాసులకు ప్రతికూలమైన వాతావరణం ఉందేమో అనేదాని గురించి అతను విచారణ చేసి ఉండవచ్చని మనం భావించడానికి సరైన హేతువు ఏదీ లేదు. ఈ వర్ణన అతను ఆత్మసంబంధమైన విషయాల్ని లోతుగా గ్రహించలేని అల్పజ్ఞాని అని, తన కళ్లకు ఏవి కనబడితే వాటిపట్లవ్యామోహంతో వాటిని కోరుకున్నాడని సూచిస్తుంది: అంటే సారవంతమైన భూమిపట్ల దానివలన కలిగే సంపదపట్ల. అక్కడ పొంచియున్న అపాయమును గూర్చి ఎలాంటి ఆలోచన చేయక, “స్వార్థము” వలన కలుగు కలహమును పుట్టించు లోకజ్ఞానమును లోతు అనుసరించాడు (యాకోబు 3:13−16 చూడండి). అతని నిర్ణయం అతనిని మరియు అతని కుటుంబమును నాశనములోనికి నడిపించింది (19:1−38).

తన స్వార్థమే ముఖ్యమని తలంచిన లోతు చాలా మట్టుకు ఏదెను తోటలోని తొలి దంపతుల్ని పోలి ఉన్నట్టుగా కనబడుతుంది. మంచి చెడ్డల తెలివినిచ్చే చెట్టుఫలాల్ని తినవద్దని దేవుడు ఆదామును హెచ్చరించినప్పటికీ, మరియు ఆదాము మరణాపాయం గురించి హవ్వకు తెలిసేలా చెప్పినప్పటికీ, వద్దనుకొన లేనంతగా నిషేధిత ఫలం ఆమెను ప్రలోభపెట్టింది. ఆదాము కూడా వద్దనకొనలేకపోయాడు (3:6). ఈ విషయంలో, వారు దేవుని నుండి వచ్చిన జ్ఞానాన్ని కాక, ఇహలోక సంబంధమైన జ్ఞానాన్నే (సర్పం) కోరుకున్నారు. ఫలితం, వారు ఏదెను నుండి తరిమివేయబడ్డారు (3:22−24).

పాత నిబంధన చరిత్రలో పలువురు తాము ఏం “చూశారో” వాటి ఆకర్షణ వలన శోధనకు గురై పతనమవడం జరిగింది. “నరుల కుమార్తెల్ని” చూచిన “దేవుని కుమారులు” వారిలో అనేకమందిని తమ భార్యలుగా చేసుకున్నారు. ఇది దుష్టత్వానికి హింసకు లోకవినాశనానికి దారి తీసింది (6:1−7, 11−13). అదే ప్రకారం, యెరికో దగ్గర ఆకాను శపితమైన వెండి మరియు బంగారపు వస్తువుల్ని చూశాడు; అతను శోధనకు లొంగిపోయి వాటిని దొంగతనం చేసి తన మీదకు తన కుటుంబం మీదకు వినాశనం తెచ్చుకున్నాడు (యెహో. 7:19−26). దావీదు తన భవంతి మిద్దె పైనుండి క్రిందకు చూచిన సమయంలో, స్నానం చేస్తున్న (బహుశా ఇది ఆమె ఇంటి లోపలి భాగంలో పైకప్పు లేని ప్రాంగణము కావచ్చు) ఒక అందమైన స్త్రీ అతనికి కనబడగా, అతని హృదయంలో వాంఛ జ్వలించింది. అతను ఈ వాంఛకు లొంగిపోవడం వ్యభిచారానికి, ఆమె భర్త హత్యకు, చివరకు దావీదు స్వంత కుటుంబంలోనే దుఃఖానికి మరణానికి కారణమైంది (2 సమూ. 11:1−12:23).

## కలహము వలని సమస్య (13:7, 8)

పలు సంబంధాల్లో కలహమునకున్న వినాశకరమైన స్వభావానికి లేఖనాల్లో కనబడే ఈ క్రింది విషయాలు వివరణాత్మకమైన దృష్టాంతాలుగా (ఉదాహరణలుగా)

ఉన్నాయి:

*వివాహంలో*—అబ్రాహాము, శారా మరియు హాగరు (16:1–9; 21:8–12); యాకోబు, రాహేలు మరియు లేయా (29:21–30:24).

*కుటుంబాల్లో*—కయీను మరియు హేబెలు (4:1–15; 1 యోహాను 3:10–14); యాకోబు మరియు ఏశావు (25:22–34; 27:1–45); యోసేపు మరియు అతని సహోదరులు (37:2–28).

*సమాజాల్లో*—ఇశ్రాయేలీయుల్లో గోత్రాల మధ్య ఈర్ష్యాద్వేషాలు: మనష్షే గోత్రంలోని గిద్యోనుకు వ్యతిరేకంగా ఎఫ్రాయిము ఫిర్యాదు (న్యాయాధి. 6:11–15; 8:1–21).

*ప్రభుత్వాల్లో*—అబ్షాలోము తన తండ్రియైన దావీదునుండి రాజ్యాన్ని తీసుకొనాలని ప్రయత్నించడం (2 సమూ. 15:1–18:33); దేవుని ప్రజలు ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలుగా, దక్షిణ రాజ్యమైన యూదాగా విడిపోయిన విషాద సంఘటన (1 రాజులు 12:1–33).

*సంఘంలో*—రోములోను (రోమా. 12:16–18; 13:13–15:7), కొరింథులోను (1 కొరింథీ. 3:1–5, 21–23; 4:1–21; 8:1–3; 13:1–13) ఉన్నట్టుగా ఎవరికి వారు తమ ఇష్టప్రకారం ద్వేషంతోను స్వార్థంతోను జీవించడం.

## అబ్రాహాముకు దేవునియందు ఉన్న నమ్మిక (13:14–18)

దేవుడు భూమిని గురించి వాగ్దానాన్ని నవీకరించినప్పుడు, ఆయన అబ్రాహాము విశ్వాసాన్ని నీతిగా లెక్కించాడు. 13:2–12 వచనాల్లోని వృత్తాంతం అబ్రాహాము లోతును తన కుమారుడిగా ప్రేమించాడని తెలియజేస్తూ ఉంది. అబ్రాహాము సహోదరుడూ మరియు లోతు తండ్రియైన హారాను మరణం తర్వాత అబ్రాహాము లోతును తన పెంపకంలోకి తీసుకున్నాడని తెలుస్తున్నది. దేవుడు అబ్రాహాముతో అతని బంధువుల్ని హారానులో విడిచిపెట్టి బయలుదేరమని చెప్పినప్పటికీ, అతను లోతును తనతోబాటు కనానుకు తీసుకొని వెళ్లాడు. అబ్రాహాము తన సహోదరుని కుమారుడైన లోతుకు తన సంపదలోని గణనీయమైన భాగాన్నే ఇచ్చి ఉండవచ్చు; ఇంకా, అబ్రాహాము అతని సంతానం నివసించబోయే వాగ్దాన దేశంలో లోతు తనకు కావలసిన భూభాగాన్నెంచుకొనేలా అబ్రాహాము అనుమతించాడు. లోతు తన ప్రజలతోను సంపాద్యాలతోను బయలుదేరి వెళ్లిన తర్వాత, శూన్యమైన అబ్రాహాము హృదయం ఓదార్పు కోరుకొని ఉండవచ్చనేది స్పష్టనీయమే.

పితరుడు ఐగుప్తులో శారా విషయంలో స్వార్థంతో వ్యవహరించి అబద్ధమాడి తన జీవితంలో అప్పటికే ఒక సారి న్యూనత అనుభవించాడు. ఈసారి, అతను లోతు యొర్దాను మైదానంలోని సారవంతమైన భూమి నెన్నుకొనేలా చేసి ఉదాత్తంగా ప్రవర్తించాడు. అయితే, లోతు తనవారితో వెళ్లిపోవడం చూచిన

అబ్రాహాము మరొకసారి జీవితంలో నిరుత్సాహపడి ఉండవచ్చు. ఏది ఏమైనా అతనికి పుత్రసమానుడైన వ్యక్తి దూరమవడంతోబాటు, కనాను దేశంలోని మేలైన ప్రదేశం కూడా అతనికి కాకుండా పోయింది.

అబ్రాహాము హృదయంలోని శూన్యత దేవునికి తెలుసు; పితరుడు తనకు తానుగా దేవుణ్ణి వేడుకొనే వరకు ఆయన వేచి చూడలేదు. ఈ సందర్భంలో, యెహోవా అబ్రాహామును వెదికి, "ఇదిగో నీ కన్నులెత్తి " చూడమని చెప్పాడు. "తన కన్నులెత్తి" లోతు తానుగా "చూచెను" అనేదానికి విరుద్ధంగా, యెహోవా అబ్రాహాముతో "చూడుము" అని తనకు తానుగా ప్రయత్నపూర్వకంగా చెప్పాడు (13:10–14). లోతు "తనకు" యొర్దాను ప్రాంతమంతటిని "ఏర్పరచుకొని" (13:11) ఉన్నాడని లేఖనంలోని వివరాలు తెలియజేస్తున్నాయి; అయితే అబ్రాహాము పొందిన భూభాగం తన నుండి వచ్చిన ఆశీర్వాదమని (బహుమానమని) దేవుడు నొక్కి చెప్పాడు. యెహోవా అబ్రాహాముతో, "... నీవు చూచుచున్న యీ దేశమంతటిని నీకును నీ సంతానమునకును సదా కాలము ఇచ్చెదను" (13:15) అని చెప్పాడు.

విశ్వాసానికి సంబంధించి అబ్రాహాము మరొకసారి సంక్షోభంలో పడినప్పుడు (గడ్డు పరిస్థితి నెదుర్కొన్నప్పుడు) దేవుడు అతనికి ధైర్యాన్నిచ్చి బలపర్చాడు. లోతు యొర్దాను మైదానంలోని భూభాగాన్ని ఎన్నుకొనడం, దేవుడు అబ్రాహాముకు అతని సంతానానికి ఇస్తానన్న దేశానికెటువంటి అపాయాన్ని దరి చేర నివ్వదనే భరోసా (నమ్మిక) కలిగేలాగా దేవుడు అతనితో దేశం గురించి వాగ్దానాన్ని పునరుద్ఘాటించాడు. తుదకు పితరుడికి, కాలక్రమంలో లోతు సంతతివారైన మోయాబీయులు అమ్మోనీయులు కనాను దేశంలోనే అసలు నివసించబోరనే విషయాన్ని యెహోవా వెల్లడిచేయవలసిన అవసరం రాలేదు. తర్వాత కాలంలో వారు యొర్దానుకు తూర్పు వైపు మరియు మృత సముద్ర ప్రాంతంలోను నివసించారు. ఈ సమయంలో, దేవుడు అబ్రాహాము నుండి కోరుకున్నదేమిటంటే, తాను దేశం గురించి ఇచ్చిన వాగ్దానం నిలకడ కలిగినదని (నిశ్చయమైనదని) అబ్రాహాము విశ్వసిస్తూ తన అనుదిన జీవితంలో తనకు ఎదురుపడే వారందరికీ ఆశీర్వాదంగా ఉంటూ ముందుకు నడవడమే. నవీకరించబడిన వాగ్దానానికి ప్రత్యుత్తరంగా, అబ్రాహాము కృతజ్ఞతాపూర్వకంగా మరొక బలిపీఠాన్ని నిర్మించి దేవుణ్ణి ఆరాధించాడు (13:18).

---

సూచనలు

[1]John H. Walton, Victor H. Matthews, and Mark W. Chavalas, *The IVP Bible Background Commentary: Old Testament* (Downers Grove, Ill.: InterVarsity Press, 2000), 44–45. [2]"కనానీయులు" (వ్యాపారులు) పట్టణాల్లోను,

"పెరిజ్జీయులు" (పల్లెవాసులు) గ్రామాల్లోనూ నివసించేవారని తెలుస్తున్నది. అయితే "పెరిజ్జీయులు" అనే పదాన్ని ఈ విధంగా అర్థం చేసుకోనడం ఖచ్చితమైనది కాక పోవచ్చు; పైగా ఈ పదం ముఖ్యంగా ఒక జాతిని సూచిస్తుంది. [3]Gordon J. Wenham, *Genesis 1–15*, Word Biblical Commentary, vol. 1 (Waco, Tex.: Word Books, 1987), 297. [4]Yohanan Aharoni and Michael Avi-Yonah, *The Macmillan Bible Atlas*, 3d ed. (New York: Macmillan Publishing Co., 1993), 19, 36 లోని 12 మరియు 34 పటములు చూడండి. [5]"నోయరుకు వచ్చువరకు" అనే మాటను అనేక వెర్షన్లు వచనం యొక్క ఆరంభంలోనికి నెడతాయి (NJPSV; NEB; REB; NAB; TEV; CEV). [6]Martin J. Mulder, "Sodom and Gomorrah," in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 6:101–2 లోని చర్చను చూడండి. [7]దేవునికి ఆయన గుణలక్షణాలకు సంబంధించినంతవరకు "శాశ్వతమైన" (నిత్యమైన) లేక "సదాకాలము" అనే అర్థాన్నిస్తున్నప్పటికీ, ఈ పదాన్ని "సదాకాలము" అనే అర్థంతో కాకుండా ఉపయోగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. [8]ఈ అభ్యాసముపై మరియు దీని నిధులపై చర్చ కొరకు, చూడండి Bruce K. Waltke, *Genesis: A Commentary* (Grand Rapids, Mich.: Zondervan Publishers, 2001), 222–23. [9]యెరూషలేముకు దక్షిణం-నైరుతిలో సుమారు ఇరవై మైళ్ల దూరంలో హెబ్రోను ఉంది.